క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్యశిబిరాలు



రాజుపాలెం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా క్షయ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించారు. కుష్టు, క్షయ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ పాల్ రవి సూచించారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య శ్రేయస్సే లక్ష్యం



ఎర్రబాలెం(క్రోసూరు): మహిళలు, పిల్లల ఆరోగ్య శ్రేయస్సు కోసం కేంద్రం స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని పీహెచ్‌సీ వైద్యాధికారి గఫ్రూన్ అన్నారు. మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశాంసన్ ,హెల్త్ ఆఫీసర్ రజని తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన పాఠశాలకు ఫ్రిజ్ బహూకరణ



సత్తెనపల్లి: పట్టణంలోని చెవిటి, మూగ, మానసిక వికలాంగుల పరివర్తన ఆశ్రమ పాఠశాలలోని పిల్లల అవసరాల నిమిత్తం సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రామానికి చెందిన పాటిబండ్ల పూర్ణయ్య, రాధికల మనవడు పాటిబండ్ల రియాన్ష పుట్టినరోజు సందర్భంగా పరివర్తన పాఠశాలకు రూ.15 వేలు విలువైన ఫ్రిజ్ బహూకరించారు. శనివారం పరివర్తన ఆశ్రమ పాఠశాల నిర్వాహకుడు కొరబండి కిషోర్‌బాబుకు ఫ్రిజ్‌ను అందించారు. కార్యక్రమంలో రియాన్ష తల్లిదండ్రులు రాజా, ఈశ్వరి, నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఆళ్ల అమరేశ్వరరావు ఉన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయొద్దు

బెల్లంకొండ: బ్లాక్ బర్లీ పొగాకు సాగును రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, రైతులు పొగాకు సాగును చేపట్టవద్దని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి తెలిపారు. శనివారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో రైతులకు పొగాకు సాగుపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, అపరాలు, మొక్కజొన్న, నూనె పంటలైన వేరుశనగ వంటి వాటిని సాగు చేయాలని సూచించారు.

సత్తెనపల్లి: రాష్ట్రంలో బ్లాక్ బర్లీ పొగాకు సాగును 100 శాతం నిషేధించారని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయవద్దని రెవిన్యూ, వ్యవసాయ, పోలీస్,ఆరోగ్య శాఖ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2025-26 రబీ నుంచి బ్లాక్ బర్లీ పొగాకు సాగును నిషేధించిందన్నారు. ఎవరైనా వేసినా ఆ భూమిని దున్నేస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ జె.నాగయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ

అమ్మ రూపం .. చూసిన కనులదే భాగ్యం



సత్తెనపల్లి త్రిశక్తిదుర్గా పీఠంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి



వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శ్రీసరస్వతీదేవిగా..

సత్తెనపల్లి: ఊరూరా దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జగజ్జనని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. పట్టణంలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో, త్రిశక్తిదుర్గాపీఠంలో, వెంకటపతికాలనీలోని శ్రీలక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారిపీఠంలో, మేదరసంఘ రామాలయం వద్ద, వడ్డవల్లి పెద్దబొడ్డురాయి సెంటర్‌లో, వడ్డవల్లి శ్రీరామాలయంలో లలితాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శ్రీసరస్వతిదేవిగా, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద శ్రీకాళికా దేవిగా అలంకరించారు. కొమెరపూడిలోని రేణుకా అంకమ్మతల్లి దేవాలయంలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, పెదమక్కెన మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీమంగళగౌరీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

నకరికల్లు: చేజర్లలోని కపోతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో, నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో మహాకాళీ అలంకరణలో దర్శనమిచ్చారు.

ముప్పాళ్ళ: లంకెలకూరపాడు శివాలయంలో లలితా త్రిపురసుందరిగా అలంకరించారు.

క్రోసూరు: క్రోసూరులో వాసవీమాత సంతానలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు.

అనంతవరం(క్రోసూరు):అనంతవరం కల్యాణవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శనివారం లక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు పట్టీల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అచ్చంపేట: స్థానిక శ్రీ సీతారామస్వామి దేవాలయంలోసీతాదేవి సంతాన లక్ష్మిగా, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలోరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రాజుపాలెం: బ్రాహ్మణపల్లి శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



పెదమక్కెనలో శ్రీమంగళగౌరీదేవి



నర్సింగపాడులో మహాకాళీదేవిగా..



సంతానలక్ష్మిగా వాసవీ అమ్మవారు



అనంతవరం వెంకన్న దేవస్థానంలో



లంకెలకూరపాడులో ప్రత్యేక అలంకరణ



బెల్లంకొండ మహాలక్ష్మీ పీఠంలో..



కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శ్రీకాళికాదేవి

స్థోమత లేనివారికి ఉచితంగా న్యాయ సాయం



సత్తెనపల్లి ఉపకారాగారంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి: ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వ న్యాయవాదిని ఉచితంగా అందించి, అలాంటి వారికి న్యాయ సేవలు అందిస్తుందని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఉపకారాగారాన్ని శనివారం ఆయన సందర్శించారు. తొలుత పరిసరాలను పరిశీలించి జైల్లో ఉన్నవారికి అందుతున్న ఆహారం, పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం అక్కడ సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. వారు ఒక్కొక్కరూ ఎన్నిరోజులుగా సబ్ జైల్లో ఉంటున్నారో అని అడిగి తెలుసుకొన్నారు. బెయిల్ వచ్చి సరైన జామీను పత్రాలు సమర్పించలేక విడుదలవ్వని విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి తోపాటు ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, సబ్‌జైలు సూపరిండెంట్ వెంకటరత్నం, కోర్టు సిబ్బంది ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సత్తెనపల్లి: త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగింది. పట్టణంలోని గుండెపుడి వారి వీధిలో లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో పలు దుకాణాలు, వాహనాలు, కరెంటు స్తంభాల ను ఢీకొంటూ దూసుకెళ్లింది. ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. ప్రాణాప్రాయం లేక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి డీఎస్సీలో ఉద్యోగాలు



ముగ్గురిని సత్కరిస్తున్న కొత్తా రామకృష్ణ, ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురాంనగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన నాగినేని ప్రవీణ్ కుమార్, కిషోర్‌కుమార్, దగ్గు ఉష ముగ్గురు డీఎస్సీలో ప్రతిభ చూపి మంచి ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం అభినందనీయమని ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ అన్నారు. ముగ్గురు అపాయింట్మెంట్ లెటర్లు అందుకున్న సందర్భంగా శనివారం కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన వారు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం శ్రమించారన్నారు. డీఎస్సీలో ఉద్యోగంతో వారి జీవితాల్లో వెలుగు వచ్చిందన్నారు. నాగినేని కిషోర్ కుమార్ మాట్లాడుతూ డీఎస్సీలో ర్యాంకు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను గుర్తుచేసుకొని ఈ ఉద్యోగం సాధించామన్నారు. తొలుత ముగ్గురికీ శాలువా కప్పి సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నం బాలసుబ్రహ్మణ్యం, సెక్రటరీ దేవరపల్లి కాశీ విశ్వనాథం, నాయకులు దేవరపల్లి రాఘవ, భవిరిశెట్టి హరికృష్ణ, చెక్క రవికుమార్, మాచర్ల సత్యనారాయణ, స్వామి ప్రసాద్ తదితరులు అభినందించారు.

నేడు డిజిటల్ బుక్ ప్రారంభోత్సవం

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు, అక్రమ కేసుల నమోదు నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండేలా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్‌బుక్‌ను ప్రారంభించారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి శనివారం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు డిజిటల్ బుక్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి కార్మికుడికి పరిహారం



మృతుని కుటుంబానికి పరిహారం మంజూరు కాపీ ఇస్తున్న ఎంపీడీవో తదితరులు

అచ్చంపేట: ఉపాధి హామీ పథకంలో కూలిపనులు చేస్తూ మరణించిన కస్తాల గ్రామస్తుడు కస్తాల ఇజ్రాయెల్‌కు ప్రభుత్వం రూ.2,00,000 పరిహారం మంజూరు చేసినట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన బాధిత కుటుంబానికి పరిహారం మంజూరు ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు చేతినిండా పని కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పనులు కావలసినవారు 'ఉపాధి' కార్యాలయంలో పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధి పనులు చేస్తూ ప్రమాదానికి గురైతే ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రాజగోపాల్, ఏవో అంబటి రమేష్‌బాబు, ఏపీఓ వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డ్ ఉప చైర్మన్ రాయిడి సాంబశివరావు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ పాపిరెడ్డి, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో పత్తికి రక్షణ

క్రోసూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రత్తి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటివరకు ప్రధాన పంటలైన పత్తి 12,227, వరి 2,550, మిరప 1,915 ఎకరాల్లో సాగు జరుగుతున్నట్లు వివరించారు. నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలన్నారు. మోతాదు మేరకు ఎరువులు వాడాలన్నారు.

గోఉత్పత్తులతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న రైతు సాధికారిక సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

అచ్చంపేట: గోఉత్పత్తులు మంచి ఫలితాలనిస్తాయని రైతు సాధికారిక సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. చామర్రులోని గోసాలకు అనుబంధంగా శ్రీ వినాయక గోఉత్పత్తుల కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచగవ్య, జీవామృతం, అనామృతం, పూజలకు వినియోగించే ప్రమిదలు, హోమాలలో వినియోగించే సమిధలు, నిత్య జీవితంలో వాడే పళ్లపొడి వంటి వాటిని వినియోగించుకోవడం ద్వారా కాలుష్యాలను తగ్గించుకోవచ్చని, ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. వీటి నిర్వహణకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తుందన్నారు. చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటి చైర్మన్ ఉప్పల శ్రీనివాసమూర్తి, వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, శ్రీరామా ట్రేడర్స్ నిర్వహకులు గోవింద రెడ్డి, రైతు వెంకటేశ్వర్లు, శివరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నందిగామ అడ్డరోడ్డు వద్ద శనివారం జరిగింది. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన మర్రి నాగరాజును నందిగామ అడ్డరోడ్డు వద్ద ఆటో ఢీ కొట్టింది. తీవ్రగాయాలపాలైన అతన్ని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

అందరి సూచనలతో మాస్టర్‌ప్లాన్

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల



మాట్లాడుతున్న సాంబశివరావు

సత్తెనపల్లి: అందరి సలహాలు, సూచనలతో పట్టణ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో శనివారం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను హైదరాబాద్ ఎమ్/ఎస్ఆర్వే ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ వారికి అప్పగించిన నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్ విజన్ డాక్యుమెంటరీ తయారీలో భాగంగా శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 28 ఏళ్ల క్రితం మాస్టర్ ప్లాన్ రూపొందించారని దానితో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రస్తుతం తయారు చేసే మాస్టర్ ప్లాన్ రాబోయే 25 ఏళ్ల వరకు ఇబ్బందులు రాకుండా తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ ఏ రోడ్డు ఎంత ఉండాలి? భవిష్యత్తులో రోడ్డు ఎంత విస్తరించే అవకాశం ఉంటుంది? పట్టణ విస్తరణ వీటన్నింటిని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశానికి పూర్తిస్థాయిలో కౌన్సిలర్లు హాజరు కాలేదని, వివిధ అసోసియేషన్లు, అన్ని వర్గాల బాధ్యులు హాజరై వారి సలహాలు, సూచనలు తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. సీఆర్‌డీఏ జోనల్ జాయింట్ డైరెక్టర్ మహాలక్ష్మి దొర మాట్లాడుతూ మరో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ తయారీ పై విస్తృత ప్రచారం కల్పించాలని కమిషనర్ ఆనంద్ కుమార్‌ను కోరారు. సమావేశంలో సీఆర్‌డీఏ అధికారులు, పట్టణ ప్రణాళికా అధికారులు, కౌన్సిలర్లు, బిల్డర్లు, ఎల్టీపీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు హాజరయ్యారు.

యూరియాకు ప్రత్యామ్నాయంగా 'ఇఫ్‌కో'

లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ రాజన్‌బాబు



కిసాన్ డ్రోన్లతో ఎరువులను ఎలా వినియోగించాలో వివరిస్తున్న రాజన్‌బాబు

అచ్చంపేట: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం పొందడానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందిన ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్‌కో) వారి ఉత్పత్తులు పంటలపై బాగా పని చేస్తాయని సంగం డెయిరీ మాజీ చైర్మన్, గ్రంథశిరి సత్తెమ్మతల్లి ఎత్తిపోతల పథకం చైర్మన్ కిలారి రాజన్ బాబు తెలిపారు. శనివారం ఆయన గ్రంథశిరి పత్తి పొలాల్లో ఇఫ్‌కో కిసాన్ డ్రోన్స్ ద్వారా ఇఫ్‌కో ఉత్పత్తులు నానో యూరియా, నానో డీఏపీ, నానో జింగ్ ఎలా స్ప్రే చేయాలో తెలిపారు. ఇది మామూలు యూరియాలా ఘన పదార్థం కాదని, ద్రావణంగా ఉంటుందన్నారు. ఈ లిక్విడ్ ఎకరా పంటకు కేవల రూ.300 నుంచి రూ.2000లోపు మాత్రమే ఖర్చు అవుతుందని చెప్పారు. పంట పెరుగుదల, నాణ్యమైన అధిక దిగుబడులకు తోడ్పడుతుందని చెప్పారు. నేల, నీరు, వాయు కాలుష్యాలను తగ్గిస్తుందన్నారు. ఈ ఎరువును పురుగు మందులతో కలిపి కూడా మొక్క తడిసే వరకు పిచికారీ చేయవచ్చని చెప్పారు. పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి సేవలో స్వచ్ఛ ఉత్సవ్-2025లో పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పారిశుద్ధ్య కార్మికుల పని విధానాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం వార్డు శానిటరీ సెక్రటరీలతో శానిటేషన్ పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. విజయసారథి, శానిటేషన్ వార్డు సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాజుపాలెం: కోటనెమలిపురిలో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సైడు కాలువల్లో మురికి నీరు తొలగించి ఇళ్ల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ మన గ్రామం-మన బాధ్యతగా పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు స్వచ్ఛ ఉత్సవ-2025 నినాదంతో పట్టణంలో శుక్రవారం మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, మెప్మా టీఎంసీ ఎండీ ఖాజావలి, సీఓ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించండి

బెల్లంకొండ: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు కలుగుతుందని ఎంపీడీవో సునీత తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీపై వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా నుంచి దీపావళి వరకు 'జీఎస్టీ -సూపర్ సేవింగ్స్' పేరుతో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఔషధాలు, తదితర అన్ని రంగాలలో పన్నులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటగిరిరెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.